# పాప్యులిస్ట్



''పాప్యులిస్ట్ అంటే? ఒక పేరెన్నికగన్న లీడర్నీ అలాగే అన్నారు ఆయన మిత్రులు?'' కాంతి ప్రశ్నించింది.

శాంతి లెక్కలలో రిసెర్చ్ చేస్తున్నది. వాళ్లిద్దరూ ఒక పెద్ద రూమ్ అద్దెకు తీసుకుని మరో యిద్దరితో అద్దె పంచుకుంటున్నారు. అద్దె చెల్లించేది శాంతే. తక్కిన వాళ్లు తమ వంతు శాంతికే అందిస్తారు. అందరిదీ పరిశోధనే. అన్ని సౌకర్యాలూ వున్నాయి. అయిదంతస్తుల భవనం. అయిదో అంతస్తు మీద నాలుగే గదులు కట్టించాడు ఓనర్. అందమైన స్క్రీన్స్ పెట్టుకుని నాలుగు భాగాలుగా చేసుకున్నారా గదిని. అల్మరాలు, లాకర్లు, షెల్ఫులూ వున్నాయి. బేస్‌మెంట్‌లో వాహనాలు పెట్టుకోవచ్చు. బోర్‌వెల్, లిఫ్ట్ వున్నాయి. బెల్ నొక్కితే, ఫుట్‌బోయ్ వస్తాడు. పనిచేసి పెడతాడు. రూమ్ క్లీన్ చేస్తాడు. డ్రైక్లీనింగ్ మెషీన్ వాడతాడు. ఫాక్సు వాడటం నేర్చాడు. ఫోన్ వస్తే జవాబిచ్చి, వార్త వ్రాసి వుంచుతాడు.

''నీ కన్నీ నేనెందుకు వివరించాలి కాంతీ? నేను నీ గైడ్‌ని కాను. ట్యూటర్ని పెట్టుకో'' అన్నది శాంతి.

''నీ కెప్పుడూ విసుగూ కోపం. జాబ్‌లో యిరుక్కుంటే యెలా మానేజ్ చేసుకుంటావో గాని'' మూతి ముడిచింది.

''రిసెర్చి పూర్తిగావటం లేదు. గైడ్ అందడు. వూరికి వుడాయిస్తాడు. నేనే చేసుకోవాలి. టైమేదీ? క్లాసులు తీసుకోమని పురమాయించాడు. మన సబ్జక్టు ఒకటి గాదు. స్టేట్స్‌లో రిసెర్చ్ చేసుకునే స్టూడెంట్సు, పుస్తకాలూ అందవు, గైడూ అందడని ట్యూటర్ని పెట్టుకుంటారుట. ఆ వచ్చే స్కాలర్‌షిప్‌తోనే. మనమూ మనదేశమూ అమెరికన్సులాగానే వున్నాము. దేశానికీ అమెరికాకి పోలికలున్నాయి'' ''అన్ని చెప్పే టైమున్నది. అడిగింది చెపితే తక్కువ టైం పడుతుంది''. ''చెప్తాపో. నన్నింక విసిగించకు. ప్రైవేసీ కరవౌతున్నది'' యేదో గుర్తు వచ్చింది శాంతికి.

''మా పెద్దక్క కూతురు ఫోన్ చేసింది. అక్కకు ఆరోగ్యం దెబ్బతిన్నదట. ''వీలుంటే రా పిన్నీ!'' అని నువ్వు తోడురా. శలవలున్నాయి. అక్కడ పాప్యులర్ట్సని చూడవచ్చు. చెప్పే కన్న చూస్తే బాగా అర్థమౌతుంది'' అన్నది శాంతి.

'' ఓ.కే. వస్తా. యీ పరిశోధన విసుగేస్తున్నది. యెప్పుడు బయలు దేరుతాము? సంచీయా, లెదర్‌కేస్ తెచ్చుకోనా?''

''చాలా రకాల సంచులు కొన్నావు కాంతీ. వాటిల్లో కల్లా అందమైనదీ తాళం వేయవీలున్నదీ తెచ్చుకో''

''ఖర్చు లెవరివీ?'' కాంతి నవ్వుతూ అడిగింది.

''గెస్టువి గదా. నావే. నీకు షాపింగ్ చేసుకోవాలనుంటే మనీ తెచ్చుకో'' అని లేచింది శాంతి.

2

సుశీల్‌రావుది యెప్పుడూ నగుమోమే. ఇంకా చెప్పాలంటే ఇహిహీ అంటూ వుండటం అలవాటు. చిడిముడిపాటు యెరగడు. భార్య లలిత మంచం మీదున్నది. అది కాంప్‌కాట్. రబ్బర్‌షీట్ మీద దుప్పటి పరచివున్నది. దానిమీద లలిత పాత చీర పరచివున్నది.

''అక్కా! ఆ మిడ్‌వైఫ్‌కీ నర్స్‌కీ బావ సరసనే కాఫీ టిఫిన్ సర్వ్ చేయాలిట. బావ చెప్పారు. వాళ్లేమో నవ్వుతారెందుకో. కిచెన్‌లో దూరతారు. మేమే చేసుకుని వేడిగా ఆరగిస్తాము. మీ కెందుకు శ్రమా అంటారు. యెవర్ని మన్నించాలి?'' నిలబడి అడిగింది శాంతి.

హాస్యాలాడుతున్నది చెల్లెలు అని గ్రహించిన లలిత, బలహీనంగా నవ్వుతూ, ''యెవరికీ వెరవక్కర్లేదు. యెవర్నీ మన్నించక్కర్లేదు శాంతీ. అందర్నీ యెంజాయ్ చేయాలి. వాళ్లిద్దరూ డాక్టరమ్మ పావనకి సహాయంగా వచ్చారు. ఆమె మిడ్ వైఫరీలో ప్రొఫెసర్. ఎబార్షనిస్ట్ అని పేరుబడినా నొచ్చుకోదు. పని పూర్తి చేసి, ''భయంలేదు. బేబీయే పడిపోతుంది. అంబలికల్ కార్డ్ నించి వేరు

చేశా. నే కోయంబత్తూరు వెళ్లిరావాలి. అక్కడ యెమర్జన్సీ కేసులు రెండు చూడాలని తీసికెళ్లానికి వచ్చారు. నా బోయ్ ఫ్రెండ్స్ ఫిజిషన్స్. స్వంత కారు డ్రైవ్ చేసుకుంటూ అఘమేఘాల మీద వచ్చారు. పేషంటు బ్లీడింగ్ అయి, బిడ్డ తిరగటం లేదుట. డోంట్ వర్రీ. నేను తెచ్చిన యిద్దరు హెల్పర్సూ బాగా అనుభవం గలవారే కనిబెట్టి చూస్తూ వుంటారు. త్వరగానే వచ్చేస్తా. వాళ్లే దింపుతారు తెచ్చి'' అని వుడాయించింది. వీళ్లిద్దరూ మిగిలారు. బేబీ అనారోగ్యంగా వుండి నన్ను జబ్బుపడేసిందని చెప్పింది డాక్టరమ్మ. బేబీ పోయింది గానీ స్రావం ఆగలేదు. కాల్షియం, ఐరన్ రెండు తక్కువే అని మంచి మందులు రాసిచ్చి వెళ్లింది. వాణికి, విజయకీ తేడా రెండున్నర సంవత్సరాలే. ఈ మాటు లేట్టైంది. విజయకి యేడోయేడు. నాకు లావు వచ్చింది. బిపి వస్తున్నది. నేను భర్తగార్నీ డాక్టరమ్మనీ వాళ్ల కథలనీ వింటూ యెంజాయ్ చేశా. ఆమెకు బంగాళా దుంపల వేపడం, ఆవకాయ ముక్క గుండా, కంది గుండా, పొడి పొడిగా వున్న వేడన్నం యిష్టంట. కరుళ్లు కరుళ్లు పెట్టద్దుట. ఆమె కిచకిచలాడుతూ మెళ్లో గొలుసు చేత్తో పట్టుకు కొరుకుతూ బావగారి మీద నించి దృష్టి మరల్చలేదు. యేదో చెప్పుకుంటూ నవ్వుతూనే వున్నారిద్దరూ. జాయింట్ కలెక్టరుతో లైఫ్ లీడ్ చేయాలనుంటే అలా యెంజాయ్ చేయాలంతే. డైవోర్స్ వల్ల నష్టమే. నవ్వుతూ వస్తూనే వుంటారు. తానే చెప్పారు'' అని వాళ్లిద్దర్నీ నవ్వించి పంపేసి కళ్లు మూసుకున్నది లలిత.

శాంతీ, కాంతీ ఒకళ్ల వంక వకళ్లు చూసుకుంటూ బెడ్‌షీట్ మార్చి, మరో చీరా జాకెట్టు కట్టి, తల దువ్వి మందు తాగించి, టాబ్లెట్సు యిచ్చి, చీర కప్పి వెళ్లారు.

సహాయమున్న వాళ్లిద్దరూ నవ్వుతూ చెప్పారు. ''భోజనం కూడా కానివ్వమ్మా. మేము శాకాహారులం కాదు. పప్పు సుద్దలు తినలేము. గూబ గుయ్ మనాలి. అదీ భోజనం. మంచి రెస్టారెంటు తెలుసు. భోజనం కానిచ్చి వచ్చేస్తాం. మీరు చూస్తున్నారుగా. బి.పి. పడిపోతున్నదంతే. బ్లీడింగ్ తగ్గింది. భయం లేదు'' అని వెళ్లిపోయారు.

వాణీ విజయా వచ్చారు బడినించి. పెట్టింది తిని మేడమీది కెళ్లారు తల్లి దగ్గరకు. టి.వి. ఆన్ చేసి వాల్యూమ్ తగ్గించి కార్టూన్ బొమ్మల చిత్రం చూస్తున్నారు. వాణి తల్లిని పలకరించి గ్లూకోజ్ తాగించింది.

సుశీల్‌రావు కాంప్ వెళ్లివచ్చి షవర్ తీసుకుని తలతుడుచుకుని లుంగీ కట్టి డైనింగ్ టేబుల్ ముందు కొచ్చేప్పటికి వేడి వేడి భోజనం ఘుమఘుమలాడుతూ ఆహ్వానించింది. కుర్చీలో కూచుని స్పూన్ అండ్ ఫోర్క్ అందుకుని కూరా అన్నం తింటున్నాడు.

శాంతీ కాంతీ గోడవారగా పేము కుర్చీల్లో వున్నారు. కాలింగ్ బెల్ మోగింది. డ్రాయింగ్ రూమ్‌లో ఫోన్ మోగింది.

ఇద్దరూ చెప్పించుకోకుండా లేచారు. కాంతి వెళ్లి వీధి తలుపుతీసింది. డి.యం.ఓ. విశాలరావు, క్రిమినల్ లాయర్ విమల్ లోపలికొచ్చేశారు.

''రండి రండి అలా కుర్చీల్లో కూచోండి. భోజనం చాలా రుచిగా వున్నది. ముడ్వంకాయ, కాకరకాయా, కాయలు మాడకుండా వేయించారు. గుత్తి బీర కుర్మాలాగా మంచి వాసన. టొమేటో సూప్. చారు. వాళ్లిద్దరు నా వైఫ్ వేపు వాళ్లు. వాణి వాళ్లమ్మ మాట్లాడటం లేదని భయపడి ఫోన్ చేస్తే, వాళ్లిద్దరు వచ్చేశారు. అదీ మన మంచికే అనాలి. లేకపోతే నేనే కుక్, సర్వర్ అయేవాడిని. వాళ్లిద్దరికీ సర్వ్ చేయి శాంతీ!'' అన్నాడు.

''నో.నో. కానిచ్చే వచ్చాము'' అన్నారుగాని, యిద్దరూ చేతులు కడుక్కుని రుమాలాతో తుడుచుకుంటూ వచ్చి వడ్డించిన పళ్లేలముందు కూచుని, స్పూన్ ఫోర్క్‌తో పనికానిస్తున్నారు. పెరుగు గిన్నె, ఐస్‌క్రీమ్ కప్పులూ, ఫ్రూట్ సలాడ్, పుడ్డింగ్ అన్నీ పూర్తిచేసి ముగ్గురూ లేచారు. మూతి అద్దుకుంటూ డ్రాయింగ్ రూమ్ లోకి వెళ్తూ సుశీల్‌రావు అడిగాడు.

''హెల్పర్స్ యిద్దరూ భోజనం చేశారా? నేను వచ్చేప్పటికి రెండు దాటింది. తినేసేయమని చెప్పే వెళ్లా. ఫోన్ యెవరు చేశారో'' అంటుండగా

విమల్ లాయర్ తానే చెప్పింది ''నేనే యింటి వద్ద చెప్పి వచ్చా సుశీల్!

నువ్వు అందవేమో అని వెరుస్తూ వచ్చా). నా కేసు గెలిచింది. నీ ఫ్రెండ్ ఎ.డి.యం.ఓ. యిచ్చిన రిపోర్టూ సాక్ష్యం వల్ల మర్డర్ కేసు గెలిచాను. నా క్లయంట్ నిర్దోషి అని తేలింది. విడుదలయినాడు. థాంక్స్ చెపుదామని వచ్చా). ఇవాళ బంద్. కోర్టు మూశారు. గోదావరి జలాలు కావాలని ఆందోళన లేవదీశారు'' అన్నది కూడా నడుస్తూ.

కాంతి అవకాశం జారవిడుచుకోకండా, '' ఆ హెల్పర్సూ తాము నాన్ వెజిటేరియన్ అంటే, 'మాకు కోడిని చంపటం రాదు. ఇంట్లో కుక్కుట సంహారి లేదు. ఈకలు పీకి చంపాలేమో. కోడి తన్నుకుంటుంటే వళ్లు జలదరిస్తుంది. లేకపోతే కోడి పలావ్ చేసేదాన్నే' అంటే వాళ్లిద్దరు నవ్వి'' మీకా శ్రమ యివ్వం. రెస్టారెంట్ ఓనర్ మా బావే. పే చేయక్కర్లా'' అని పరుగెత్తి అంబులెన్సెక్కి వెళ్లిపోయారు'' అన్నది.

గృహస్థు అభ్యాగతులూ యిహీహి అంటూ డ్రాయింగ్ రూమ్ సోఫాల్లో స్థిరపడి యెదురుగా పేము ప్లేటులోని బీడాలందుకుని నమలసాగారు.

సుబ్బారావనే ఫ్యూన్ వచ్చి, అఫిషియల్ పేపర్సు బల్లమీదుంచి సెల్యూట్ కొట్టాడు. అటెన్షన్‌లో నిలబడ్డాడు. ఒక కానిస్టేబుల్ పురుషోత్తం ఒక కవరు పర్సనల్ అనేది తెచ్చి గృహస్థుకిచ్చి సెల్యూట్ కొట్టి అటెన్షన్‌లో నిలబడ్డాడు.

''భోజనమైందా? లేకపోతే తినండి. భోజనం వేళ'' అన్నాడు జాయింట్ కలెక్టర్ సుశీల్‌రావు. కవర్ విప్పుతున్నాడు.

''అయింది సార్. మూడు కావస్తున్నది'' అన్నారు ముగ్గురూ.

''సుబ్బారావ్! రాత్రి బాగా నిద్రపట్టిందా? ఆ షెడ్‌లో దోమలూ. ఇంటికెళ్లనన్నావెందుకనో. దోమతెర వేసుకో. నిద్రపట్టేందుకు హాఫ్ టేబ్లెట్ పొట్లం కట్టి షెల్ఫు మీదుంచా వేసుకో''

''అప్పులు చేయించారు సార్ నా చేత. చెల్లి పెళ్లి యింటి పన్నూ అన్నిటికీ నా డబ్బే. శ్యామాలే కొట్నీస్ అనే ఎక్స్ట్రా తారకు డ్రైవరుగా పనిచేశా. నెలకు వేయి, భోజనం, యూనిఫామ్, యెవరికైనా కారిస్తే, నాకు టిప్ అందేది సార్.

సర్వెంట్ క్వార్టర్సు. మా వాళ్లు డెబ్బులాగారామె వద్దనుంచి. నన్ను పంపేసింది మూడు నెలల జీతమిచ్చి ఒక నెల నోటీసిచ్చి, క్వార్టర్సు ఖాళీచేయమంది. మరో డ్రైవర్ని యెంగేజ్‌చేసిందట అమ్మగారు పురుగుల మందే నా కష్టాలు తీరుస్తుంది'' అని జాలిగా వినేట్టు అన్నాడు.

''నేనొచ్చి చెప్తాలే. అప్పు చేయ రోత హరిహరాదుల కైన అని మా నాన్న అప్పులు చేసే మతాచారాలు పాటిస్తే అసలుకంటే వడ్డీ పెరిగింది. భూమి అమ్ముతానంటే నేనూ మా అన్నా తీరుస్తామని ఆపాము. నెవర్ సే డై. పోరాడాలి. రెసిస్ట్ చేయలి అదీ పద్ధతి''.

పోలీస్‌తో అన్నాడు ''అమ్మగారు మాట్లాడాలిట. రాత్రికి భోజనం వేళకి వస్తానని వ్రాసి పంపారు. రావచ్చు. ఫోన్ చేయచ్చునే రాజారమణి అమ్మ. నీకు శ్రమ కల్పించిందే. వాహనం లేదేమో. నా జీప్‌లో వెళ్లు. చాలా దూరం వాళ్లక్వార్టర్సు, నడిచి వెళ్తావాయేం?''

''ఫోన్ డిస్‌కనెక్ట్ చేయించారు బాబు. ఇద్దరికీ చుక్కెదురు. అమ్మగారు పుట్టింటికెళ్లిపోతారు. బాబు పోయితెస్తారు. అదేదో తేల్చుకోవాలను కుంటానంటారు అమ్మగారు. డైవోర్స్ మార్గం అంటారు''.

సుశీల్‌రావు నవ్వుతూ అన్నాడు '' ఆయన ఎడిక్ట్. నే మార్గం చూశా. మాన్పిస్తా. అమ్మగారికి నే తెలియజెప్పుతాలే. రావచ్చు''.

అలా అందర్నీ వూరడించి, అభ్యాగతులను పంపించి లోపలికొచ్చాడు సుశీల్‌రావు. వీళ్లిద్దరూ బల్లక్లీన్ చేస్తూ కంటబడ్డారు.

''సుందరరామూర్తి గారు హాస్పిటల్ సూపరింటెండెంట్. ఆయన భార్య శ్రీశైలం చూడాలంటున్నదిట. కర్నూలుకి దగ్గర శ్రీశైలం. వానూ, దోమతెరలూ, వాళ్ల సర్వెంట్సూ, యిద్దరు కూతుళ్ళూ, కుక్క పిల్లా వెళ్తున్నారు. నేను ఫోన్ చేసి అన్నీ అరేంజి చేశాను. మీ ఇద్దరూ ఆ వానులో వెళ్లిచూసి రండి'' అన్నాడు.

శాంతి తలొంచుకుని బల్ల తుడుస్తూ వింటున్నది. కాంతి తకీమని జవాబిచ్చింది. ''వెళ్లం సార్. రిసెర్చ్ చేసుకుంటున్నాం. మెటీరియల్సు

తెచ్చుకున్నాం. ఆమె లెక్కలు. నేను ఆంత్రోపాలజీ. స్కాలర్‌షిప్ అయిపోయి ముగియక ముందు థీసిస్ పెట్టేయాలి. అబార్షనిస్ట్ యీజ్ హాండీ. ఆమెకు పనికల్పించండి సార్. యూ ఆరె వూన్. ప్రాణం మీదికి వచ్చి బి.పి. పడిపోతున్నదని పరుగెత్తు కొచ్చాము. లలితక్కకి ముప్పై రెండేళ్లే. మీకు నలభైయ్యే'' అంటున్నది బల్ల తుడుస్తూనే. సుశీల్‌రావ్ తలొంచుకు డైనింగ్ రూమ్ వదిలి బెడ్‌రూమ్ వేపు వెళ్లాడు.

శాంతి మెప్పుగా కాంతివంక చూసింది.

3

కాంతి సుశీల్‌రావుని స్టడీ చేయడానికా అన్నట్టు నెలరోజులకు గానీ లలిత లేచి తిరగలేదు. బి.పి. పడిపోయేది. బ్లీడింగ్ తగ్గినా పూర్తిగా కట్టుకోలేదు. కాంతి విసుగూ, చికాకూ కలిగితే ప్రయత్నించి కామ్‌గా వుండగలిగింది. శాంతికి వెరిచింది.

లలిత మేడమీద గదిలో నిద్రపోతున్నది. పిల్లలు బడికెళ్లారు. భోజనం చేస్తూ కాంతి అడిగింది.

''శాంతీ పోదామా. మీ అక్కకు నిమ్మళించింది. బి.పి. స్టెడీగా వున్నది. మీ అక్కతో చెప్పు. బావతోనూ''.

''నువ్వడిగిన దానికి సమాధానం చూస్తున్నావు. బాగా అర్థమైందీ? లలితక్క వేగుతూనే తెలుసుకున్నది''.

''అన్నిటిలోనూ కలగజేసుకుంటూ, అడగనిదే సలహాలు పారేస్తు, దిద్దుబాటు చేస్తుంటే నగుమోము చూసి పైకేమీ అనకపోయినా మనసులో న్యూసెన్సు అనుకోరూ?''

''చూశావా కాంతీ నీవే బాగా చెప్పగలిగావు. అందుకే తోడు రమ్మన్నా. అక్కకు చెప్పేశా. పిల్లలు మాత్రం వుండమన్నట్టు చూశారు. రిజర్వు చేయించా'' అన్నది శాంతి.

'' ఆ ఫ్యాన్ చెప్పేది వినిపించుకోటం లేదని కంప్లెయింట్ చేస్తే, వాడికి ఒకచెవ్వు వినబడదు'' అని జవాబు. భోజనం కానిస్తున్నారు బావగారు. నువ్వు పైన వున్నావు. ''పనిమనిషి దొంగ. పొగరు. జమాను చేస్తాడు ఫర్లేదంటున్నది'' అన్నా. ''కాదు కాదు. పాపం యెక్కువ డిశ్చార్జ్ అయిందిట. బలం లేక చేయలేకపోయిందిట. చేస్తా బాబూ. తగ్గింది'' అన్నది. సుంకన్నది పర్మినెంట్ జాబ్ గాదు. వాడికి పర్మినెంట్ చేయిస్తా. రాలేకపోతున్నానంటే సైకిలు కొనిచ్చి, పర్మినెంటు చేయగానే కిమ్మనకుండా అన్నీ చేస్తాడు'' అని సర్దారు బావగారు. ''నాగోజీని వేయించండి. వాడన్నీ చేస్తానంటున్నాడు'' అనడిగితే, ''వాడు లోఫర్, భటాచోర్. వాడిదీ టెంపరరీ జాబే. పర్మినెంట్ చేయించమని అలా పూరిస్తున్నాడు'' అని జవాబు. కోయంబత్తూర్నించి డాక్టరమ్మ వచ్చింది. తగ్గలేదంటే, ''లేవరాదని చెప్పి వెళ్లానే. ఇంతమంది వున్నారింట్లో'' అన్నది. ఇద్దరూ గబగబా అన్నందిన్నారు కబుర్లాడుతూ. ఆమెను స్వయంగా దింపి వచ్చారు కారులో.

## 4

''పిన్నీ మీ యిద్దరికీ థాంక్స్. అమ్మ లేచి తిరగగలిగేదాకా వున్నారు. మాకు ధైర్యమిచ్చారు. మా నాన్నగార్ని యెంజాయ్ చేశారు. ముఖ్యంగా కాంతి పిన్ని. మీరు వెళ్లిపోయివుంటే అమ్మ దిగులుపడేది. మమ్మల్ని దయగా చూశారని సంతోషించింది. తమ్ముడు నేరం చెప్పడుగానీ నాన్నగారికి తెలుసు. వాళ్లనేమీ అనరు. తమ్ముడినే అంటారు. అమ్మ అందుకే నిదానంగా వుంటుంది. మేము అమ్మ పక్షమే'' అన్నది వాణి.

'' ఈడుకు మించిన మర్యాదా మన్ననా సభ్యతా చూపుతున్నది వాణి'' అని ఒళ్లో కూచోపెట్టుకుని ముద్దులాడింది.

''యెన్నో స్టాండర్డ్ వాణీ'' అనడిగింది కాంతి.

''సెవెన్త్ స్టాండర్డ్ పిన్నీ. తమ్ముడు మూడో తరగతి''.

''వాణీ మీ నాన్న నీమందామూ?'' అన్నది హాస్యానికి.

''డాక్టరమ్మ లాయరమ్మా, యింకా స్నేహితులూ నాన్నను మొహం మీదే హాస్యమాడుతూ అంటారు పిన్నీ. సూడో కమ్యూనిస్ట్. పాప్యులిస్ట్. కార్మిక నాయకుడు. లేబర్ పార్టీ. డాక్టరమ్మ యింకా అంటుంది. నాన్న దగ్గర బాగా చనువున్నదామెకి. ''తానూ సంపాదించడు. ఇతరులను సంపాదించుకోనీయడు. నీతి శాస్త్రం, ధర్మపన్నం వల్లిస్తాడు సుశీల్. ఆయన నగుమోము చూసి యేమీ అనరు గానీ చాటుగా న్యూసెన్సు అంటారు. ప్యూన్‌పుల్లప్ప ''బాబెప్పుడో కలెక్టరు గావాలి. గెలవలేమని ఆపుతున్నారు. సాటి వుద్యోగులు'' అన్నాడు మాతో. కాంతి వాణిని కౌగిలించుకుని ''జెమ్'' అన్నది.